# ఇదో రకం

రేగిడి నాగభూషణరావు



ఓసారి పూరీ-తిరుపతి ఎక్స్‌ప్రెస్‌లో బరంపురం నుంచి వైజాగ్ వెళ్తున్నాను. ఇచ్ఛాపురం స్టేషన్‌లో నేను కూర్చున్న కంపార్ట్‌మెంట్‌లోకి నలుగురు పెద్ద మనుషులు ఉరుకులు. పరుగులతో దూరారు. కంపార్ట్‌మెంటులో అంతగా రద్దీ లేదు. ఆ నలుగురు వచ్చి నా ముందే కూర్చున్నారు.

"రోజూ రెండు గంటలు లేటుగా వచ్చే ఈ వెధవ ట్రైను ఈ రోజు ఒక్క గంట లేటులోనే వచ్చేసింది. మనం బయలు దేరామనికాబోలు" ఆశ్చర్యంగా అన్నాడు బొద్దు మీసాలాసామి. మిగతా ముగ్గురూ వంత పాడారు.

బొ. మీ. ఆసామి కళ్ళ లాల్చీ జేబు లోంచి ఒక పొగాకుచుట్ట తీసిముట్టించాడు. కిటికీ ప్రక్కగా కూర్చుంటే తనకు సదుపాయంగా వుంటుందని. నేను కూర్చున్న చోటు తనకు కావాలని అభ్యర్థించాడు. కాదన లేకపోయాను. అతను. నేను సీట్లు మారాం

తమ బంధువుల అబ్బాయి పెళ్ళికి సింహాచలం వెళుతున్నట్లు నేను అడగకపోయినా నాతో చెప్పారు. పత్రిక పేజీలు తిరగ వేస్తూనే వాళ్ళ సంభాషణలు వింటున్నా. వాళ్ళ 'కవిటి' గ్రామం మొదలు ఢిల్లీ వరకు గ్రామసర్పంచ్ నుంచి రాజధాని మంత్రుల వరకు జరుగుతున్న అన్యాయాలు. లంచ గొండితనాలపై వాళ్ళ మధ్య చర్చ సాగుతుంది.

వాళ్ళు టిక్కెట్టు కొన్నారా. లేదా అని అనుమానం వచ్చింది.

కాని.... నా అనుమానం తీరేదెలా?

మీరు టిక్కెట్లు కొన్నారా అని అడిగితే మర్యాదగా వుండదు. కాని వాళ్ళు టిక్కెట్లు లేని ప్రయాణీకులన్న నమ్మకం నాలో ఏర్పడిపోయింది.

పలాసా స్టేషన్లో టి టి ఇ. మా కంపార్ట్‌మెంటు ఎక్కాడు. ట్రైను కదిలింది.

ఆ పెద్దమనుషుల అసలురూపం ఇప్పుడు బయటపడుతుంది

నా అనుమానం నిజమౌతుంది.

నా టిక్కెట్ తనిఖీ అయింది. టిక్కెట్ చూపమని బొ మీ. వైపు చేయి చాచాడు టి.టి ఇ.

ఇక బొ.మీ టిక్కెట్లు లేవని బేల మొహం.... కాదు ఏడుపు మొహం పెట తాడు! తప్పదు! నేను ఎదురుచూసే క్షణం రానే వచ్చింది. అతనివేపు ఆసక్తిగా చూశాను.

"రైలు ఛార్జీలు పెరుగుతున్నా టిక్కెట్లు కొనక తప్పుతుందా?" అంటూ ఎంతో దర్పంగా. నిర్లక్ష్యంగా కళ్ళ లాల్చీ జేబు లోంచి టిక్కెట్లు తీశాడు— నా కాశ్చర్యాన్ని కలిగిస్తూ

నాకు కళ్ళు జిగ్గుమన్నాయి. లెంపకాయ కొట్టినట్టనిపించింది.

అతన్ని నేనెంత తక్కువగా వూహించాను!! నాలో నాకే చాలా సిగ్గేసింది. ఎదుటి వారిని దొంగలు. ద్రోహులుగా వూహించినందుకు నాలో పశ్చాత్తాపం.

బొ.మీ.టిక్కెట్లు టి.టి ఇ.కి ఇవ్వబోతూ వుంటే గాలికి ఎగిరి కిటికీలోంచి బయటపడిపోయాయ్. నేను కూడా చూశాను.

"అయ్యో! టిక్కెట్లు" అంటూ గాభరాగా కిటికీలోంచి బయటికి తొంగి చూశాడతను. టిక్కెట్లు ఎక్కడికి ఎగిరిపోయాయో కనిపించలేదు. ఏ భావమూ లేని ముఖంతో ఏం చేయాలో తోచక టి.టి.ఇ.ని చూస్తున్నాడతను.

"టిక్కెట్లు చూపించండి" అధికారంగా అడిగాడు టి టి ఇ.

"టిక్కెట్లు... టిక్కెట్లు మీరుచూస్తుండగానే...." కిటికీవైపు చూస్తూనే జరిగిన విషయం చెప్పబోయాడు బొ. మీ.

"ఆ విషయం నాకనవసరం- మీరు టిక్కెట్లు చూపించండి."

"మీ కళ్ళముందే జరిగింది కదండి. ఇంకా ఎక్కడనుంచి టిక్కెట్లు చూపించమన్నారు?"

"మీరు టిక్కెట్లు లేకుండా ప్రయాణం చేస్తున్నట్టు ఛార్జి చేయాల్సి వస్తుంది" నల్లకోటు జేబులోంచి పుస్తకం తీస్తూ అన్నాడు టి.టి.ఇ.

బొ.మీ. విస్మయంగా నలువైపులా చూస్తున్నాడు.

జరిగిన విషయం యదార్థమని నేను టి టి.ఇతో వాదించాను. తోటి ప్రయాణీకులు కూడా నా వాదనను బలపరచారు. టి.టి.ఇ. మెత్తబడిపోయి విడిచిపెట్టాడు.

జరిగిన సంఘటన ఇంకోసారి చర్చా విషయమైంది. తర్వాత ఏదో పిచ్చాపాటి కాలక్షేపంతో ప్రయాణం సాగింది.

సింహాచలం స్టేషను వచ్చింది. బొ.మీ. ఆసామి అతని బృందం దిగబోతున్నారు.

"టిక్కెట్లు పోవడం కారణంగా మీరు టి.టి ఇతో రభసపడ్డారు" అన్నాను నేను.

"మరేం పరవాలేదులెండి. గాలిలో ఎగిరిపోయిన ఆ టిక్కెట్లు నిజమైనవి కావు. అవి చిరువు తూచుకున్న టిక్కెట్లు. కావాలని నేనే కిటికీలోంచి పారేశాను" ఘనకార్యం చేసినట్టు దాబుగా చెప్పి నడక సాగించాడు బొ. మీ. అతని బృందం నవ్వుతూ అతన్ని అనుసరించింది.